క్లుప్తంగా

పెనమలూరుకు ముగ్గురు ఎస్‌ఐలు

పెనమలూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా ముగ్గురు ఎస్‌ఐలు విధుల్లో చేరారు. ఇటీవల పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ భారీ ప్రక్షాళన చేశారు. ముగ్గురు ఎస్‌ఐలు, 22 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. తాజాగా ఎస్‌ఐలుగా షేక్ ఫిరోషా, రమేష్, ఏసోబు విధుల్లో చేరారు. 21 మంది కానిస్టేబుళ్లు కూడా ఇటీవల విధుల్లో చేరారు.

కట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు.. కానూరు కామయ్యతోపునకు చెందిన కాకాని రమ్యశ్రీకి హైదరాబాద్ మియాపూర్ జేపీనగర్‌కు చెందిన వీరేంద్రకుమార్‌తో 2021 సెప్టెంబర్ ఒకటో తేదీన వివాహమైంది. పెళ్లి సందర్భంగా రమ్యశ్రీ తల్లిదండ్రులు కట్న కానుకలు, ఆడపడుచు కట్నం ఇచ్చారు. అయితే రమ్యశ్రీ హైదరాబాద్‌లో కాపురం పెట్టిన తరువాత అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది ఫిబ్రవరిలో ఆమెను కానూరులోని పుట్టింట్లో వదిలేశారు. పైగా తనకు విడాకులు కావాలని వీరేంద్ర కుమార్ ఇటీవల నోటీసు కూడా ఇచ్చాడు. వేధింపులు తాళలేని రమ్యశ్రీ తన భర్త ఏలూరు రవీంద్రకుమార్, అత్త రాజ్యలక్ష్మి, ఆడపడుచు ఉషారాణి, ఆమె భర్త సత్యనారాయణరాజుపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మైక్రోఫిల్టర్స్ బెడ్స్ ఏర్పాటుకు తీర్మానం

నున్న(విజయవాడరూరల్): నున్న పంచాయతీ ఆధ్వర్యంలోని తాగునీటి ఫిల్టర్ బెడ్స్‌ను జలజీవన్ మిషన్ నిధులతో మైక్రో ఫిల్టర్స్‌గా మార్చేందుకు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ముందస్తు ప్రణాళికపై గ్రామసభలో సమీక్ష జరిగింది. గ్రామంలోని రెండు తాగునీటి చెరువుల చుట్టూ వాకింగ్‌ట్రాక్ నిర్మించడంతో పాటు, కొబ్బరిచెట్లు నాటేందుకు గ్రామసభ చర్చించి తీర్మానం చేసింది. వీటితో పాటు జగనన్న కాలనీలో చేపట్టే అభివృద్ధి పనులు, దోమల నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలు, డ్వాక్రా గ్రూపులు, మహిళా సంరక్షణ తదితర అంశాలపై గ్రామసభలో చర్చించారు. గ్రామ సభలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పాలకవర్గం సభ్యులు యార్కారెడ్డి వెంకటరెడ్డి, స్వాతి, సైదాబి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుతున్నాయని తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. పోరంకి-1 సచివాలయం పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజలు ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. అసిస్టెంట్ కమిషనర్ కె.అభినేష్ మాట్లాడుతూ.. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో 30 వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అత్యవసరమైతే ఆరోగ్య శ్రీ నెట్ వర్కు ఆస్పత్రుల్లోనూ వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రజలంతా ఈ వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఆకునూరి మాణిక్యం, వైఎస్సార్ సీపీ నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.



పోరంకిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావు, అసిస్టెంట్ కమిషనర్ అభినేష్



గండిగుంటలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న అనుపమ, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు



మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ రవి, సర్పంచి సాంబశివవెంకన్నబాబు



తరిగొప్పలలో కిట్లు అందజేస్తున్న డాక్టర్లు, అధికారులు



గంగూరులో మందులు అందజేస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీతాశర్మ

గంగూరులో 320 మందికి వైద్య సేవలు

గంగూరు సచివాలయం-1లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 320 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. మండల ప్రత్యేకాధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండల పరిధిలో అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే సచివాలయాల వారిగా తేదీలు ప్రకటించామ న్నారు. ఉచిత వైద్య సేవలు ప్రజలు పొందాలని సూచించారు. ఎంపీడీఓ సునీతాశర్మ, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. గంగూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 25 మంది పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అన్ని పంచాయతీల్లో కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందిస్తామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు.

ఆరోగ్య సురక్షే శ్రీరామరక్ష

ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్షే ప్రజలకు శ్రీరామ రక్ష అని ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గండిగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం జరిగింది. ఈ శిబిరంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్వేత, డాక్టర్ దీప, డాక్టర్ తేజస్విని, డాక్టర్ రాకేష్ అనిల్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ భరత్ పాల్గొని 577 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ గెత్తం అనుపమ ప్రారంభించారు. తహసీల్దార్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని ప్రత్యేక అధికారి జ్యోతి పరిశీలించారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజలందరూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని, ప్రతి ఒక్కరికీ మెరుగైన నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లిరెడ్డి రవికుమార్‌రెడ్డి తెలిపారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ అడపా అంజిబాబు ప్రారంభించారు. ఈ వైద్యశిబిరానికి హాజరైన రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. 108 అంబులెన్స్, 104 వాహనం, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా పేద ప్రజలందరికీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరంలో 564 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు చిర్రా అంజిబాబు, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు చెన్నుబోయిన వెంకటేశ్వరమ్మ, కె.సీతారామపురం సర్పంచ్ చెన్నుబోయిన వెంకట మహాలక్ష్మి, ఉప సర్పంచ్ పుసునూరి సాంబశివరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

గన్నవరం: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. మండలంలోని అల్లాపురం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం వైద్య క్యాంప్‌ను పరిశీలించిన ఆయన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... అనారోగ్యంతో ఏ ఒక్కరు బాధపడకుడదనే ఉన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష ప్రారంభించారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి కార్పొరేట్ తరహా వైద్య సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆహర్నిశలు పాటుపడుతున్న సీఎం వైఎస్. జగన్‌కు, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి చెప్పారు. సురక్ష క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబు అధ్యక్షతన ఉపసర్పంచి ఆవుటపల్లి శివప్రసాద్, ఎంపీటీసీ గంతోటి ప్రశాంతి, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈవోపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, పలువురు వైద్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంప్ ఏర్పాట్లు బేష్

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహణ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. క్యాంప్ ఆవరణలో వైద్యం కోసం వచ్చే ప్రజలు కూర్చొనేందుకు ప్రత్యేకంగా టెంట్‌లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఐదు వైద్య విభాగాలకు సంబంధించి వార్డులు, రక్త పరీక్షలు, మందులు పంపిణీ విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. తాగునీరు, అల్పాహారం అందుబాటులో ఉంచారు.

నేడు ప్రొద్దుటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్ మంగళవారం తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే వైద్య శిబిరంలో ప్రజలను నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలందరికీ ఆరోగ్యమే లక్ష్యం

ఉంగుటూరు: ముందస్తు జాగ్రత్తలతో దీర్ఘకాలిక వ్యాధులకు జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్యసేవలు అందిస్తున్నారని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. తరిగొప్పల గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో 502 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామ సర్పంచి యాండ్రపు అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు వి.లావణ్య, కె.ప్రసన్నరాణి, శిరీష, మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి పిచ్చియ్య, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీమోహన్ ఆర్థిక సాయం

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలులో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల పోలారెడ్డి రాజేష్ రెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. విషయం తెలిసిన తక్షణమే ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.50 వేలు మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్‌రెడ్డి ఇంటికి వెళ్లి నగదును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ లాం దిబోర, గ్రామ కన్వీనర్ వింత శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తియ్యగూర రామిరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, తిరుమలరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కలకోటి కోటిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: మండలంలోని పోరంకి సెక్షన్‌లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు మంగళవారం తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతాపురంకాలనీ, పోరంకి పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: తన భర్త కనిపించడం లేదని ఓ వివాహిత ఫిర్యాదు చేయటంతో పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కానూరు మురళీనగర్‌కు చెందిన తిరుమలరెడ్డి ఈశ్వరమ్మ తన భర్త రమణ, కుమార్తెతో కలిసి నివసిస్తోంది. వారికి ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయింది. రమణ తాపీ పని చేస్తాడు. అయితే ఇంటి సమీపంలో నివసించే మహిళతో రమణకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై ఈశ్వరమ్మ దంపతుల మధ్య కొద్ది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. గత నెల 23వ తేదీన శ్రీకాకుళం జిల్లా జి.సిగడం మండలం గోబురు గ్రామంలో సంబరాలకు భార్యాభర్తలు వెళ్లారు. సంబరాలు ముగిసిన తరువాత రమణ గత నెల 27వ తేదీన కానూరు వచ్చాడు. ఈశ్వరమ్మ అదే నెల 29వ తేదీన తన భర్తకు ఫోన్ చేయగా సమాధానం రాలేదు. ఈశ్వరమ్మ కంగారుగా గత నెల 30వ తేదీన కానూరుకు వచ్చింది. అయితే ఇంటికి తాళం వేసి ఉంది. భర్త కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్తం

- **కేంద్రం రైతు వ్యతిరేక విధానాలతో నష్టం**

కంకిపాడు: కేంద్రంలో ప్రధాని మోదీ సర్కారు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని కౌలురైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు పేర్కొన్నారు. లఖీంపూర్ ఖేరి ఘటనలో నలుగురు రైతుల మరణానికి కారణమైన కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త బ్లాక్ డే పిలుపులో భాగంగా కంకిపాడులో మంగళవారం నిరసన తెలిపారు. ప్రజాసంఘాల బాధ్యులు టి.నరేష్, వై.జోజి, సీహెచ్.వి.రెడ్డయ్య, ఎం.చంటి, వి.వెంకటేశ్వరరావు, పీతా నాగేశ్వరరావు, పటాన్ మహమ్మద్, పి.సాంబయ్య పాల్గొన్నారు.

- **రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి**

పెనమలూరు: రైతులు తాము సాగుచేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి సూచించారు. మండలంలో పలు గ్రామాల్లో ఆమె మంగళవారం ఈ-క్రాప్ నమోదును సూపర్ చెక్ చేశారు. మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, ఏఈఓలు పాల్గొన్నారు.

- **కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం సాగించాలి**

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై సంఘటిత పోరాటం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి తోట సాంబశివరావు, సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

- **వాసవీ సేవా సంఘం కమిటీ ఎన్నిక**

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండల శ్రీ వాసవీ సేవా సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం రామవరప్పాడులో మంగళవారం జరిగింది. ఆర్య వైశ్య సంఘం అర్బన్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ(కొండపల్లి బుజ్జి) ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా మాదాల వెంకట రమేష్, ఉపాధ్యక్షులు పురిమి సుబ్రహ్మణ్యం, కోట రామకృష్ణారావు, కార్యదర్శి చిన్ని సుబ్రహ్మణ్యం కోశాధికారి చీదెళ్ల వెంకట నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు.

- **డీవైఈఓ ఆకస్మిక తనిఖీ**

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో గుడివాడ డివిజన్ ఉప విద్యా శాఖాధికారిణి పద్మరాణి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో జరిగిన నాడు - నేడు పనులపై అందిన ఫిర్యాదుల మేరకు ఆర్‌జేడీ ఆదేశాలతో తనిఖీ చేశారు. హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని పర్యవేక్షణలో జరిగిన నాడు - నేడు పనులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఎంఈవో-2 కమల, ఏఈ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

- **అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి**

పెనమలూరు: గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు సూచించారు. గంగూరు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, బడ్జెట్ అంచనాలు, ఏ పనులు చేపట్టాలి అనే విషయమై తీర్మానాలు చేయాలని సూచించారు. మండలంలో ఆరు పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు.

- **మంగళగిరి వెళ్లి పింఛన్ అందజేత**

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద సచివాలయం - 2లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చిన్ని సురేష్ గ్రామానికి చెందిన దగ్గు బాలకృష్ణకు మంగళవారం పెన్షన్ అందజేశారు. వృద్ధాప్యంలో కుమార్తె వద్ద అనారోగ్యంతో కదలలేని స్థితిలో మంగళగిరిలో ఉన్నాడని గ్రామస్తులు తెలపడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ మంగళగిరి వెళ్లి పెన్షన్ అందజేశారు. పింఛన్ అందజేసిన వారిలో సచివాలయం-2 కార్యదర్శి పి. ఏసుప ఉదయశ్రీ ఉన్నారు.

- **మంతెనలో అన్నసంతర్పణ ప్రారంభం**

కంకిపాడు: మండలంలోని మంతెనలో శ్రీ రామభక్త అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. గురుస్వాములు చిమటా ప్రసాద్, తాతా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 48 రోజులు పాటు నిర్విరామంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశారు. అయ్యప్ప, భవానీ, శివ, గోవింద దీక్షలు స్వీకరించిన స్వాములకు నిత్యం సద్ది అందించనున్నారు. కార్యక్రమంలో కొండవీటి వెంకట సుబ్బారావు, మాదు సుబ్రమణ్యం, మాదు శ్రీను, ఉప్పలూరు సాయి, యాదల శ్రీను, వీరంకి నాగు, ఉప్పలూరు సుబ్బారావు పాల్గొన్నారు.